# నా నిర్ణయం




లక్ష్మీ భారతీరెడ్డి

**సమీప బంధువొకరు తిరిగి రాని తీరాలకు తరలి వెళ్ళడంతో అమ్మా, నాన్న పరామర్శకు వెళ్ళారు. ఇంట్లో మిగిలింది నేను, మా బావ ఇద్దరమే.**

**కువైట్ నుంచి తిరిగి వచ్చి రెండు వారాలు గడుస్తున్నా బావ నాతో అంతంత మాత్రమే మాట్లాడుతున్నాడు. నాతోనే కాదు, అమ్మా నాన్నలతోనూ ఇంతే.**

ఆ మిత భాషణానికి కారణం కనుక్కోవాలని నేను ప్రయత్నించే అవకాశం రాలేదు. అయితేనేం ఆ అవకాశం ఇప్పుడొచ్చింది ఇంట్లో మేమిద్దరమే ఉండటం వల్ల.

బావ తలిదండ్రులు అతని చిన్నతనంలోనే రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో మా ఇంట్లోనే పెరిగాడు. దాంతో మా ఇద్దరి మధ్య ఎనలేని చొరవ ఏర్పడింది. వంట పని పూర్తికావడంతో బావ గది తలుపులు చిన్నగా తెరచి చూశాను. కిటికీ ఎదురుగా కూర్చుని ఎటో చూస్తున్నాడు.

మెల్లిగా నడుచుకుంటూ వెళ్ళి "బావా" అని అతని చెవిలో అరిచాను. అనుకోని సంఘటనలకు ఎవరైనా అదిరిపడతారు. కానీ బావ మాత్రం మెల్లిగా తల తిప్పి చూశాడు నిశ్శబ్దంగా. అతనలా ప్రశాంతంగా ప్రతిస్పందించినందుకు ఆశ్చర్యపోయి

"ఏం బావా అదిరిపడలేదు కిటికీలోంచి ఎవర్ని అంత ధ్యాసగా చూస్తున్నావ్?" చిలిపిగా తన చెవి మెలిపెడ్తూ అన్నాను.

"ప్రకృతిని" సున్నితంగా నా చేతిని తొలగిస్తూ అన్నాడు నిర్మలంగా.

"నీకు ప్రకృతి నచ్చినంతగా నేను నచ్చలా?" బుంగమూతి పెట్టాను.

"అదీ"

"అదో, మరేదో నాకొద్దు. రెండేళ్ళ తర్వాత విదేశం నుండి స్వదేశం వచ్చి ఎందుకంత మౌనంగా ఉంటున్నావు?"

"ప్రత్యేకమైన కారణాలంటూ ఏమీ లేవు"

"అదో మళ్ళీ ముక్తసరి సమాధానం. బావా నీకు తెలుసా? బహుశా తెలిసే ఉంటుందిలే. త్వరలో మన పెళ్ళికి ముహూర్తాలు పెట్టించాలని అమ్మా నాన్నలు అనుకుంటున్నారు."

"..........."

"ఏం బావా మాట్లాడవు?"

".............."

"నిన్నేనయ్యా మహాశయా! ఏం ఈ శుభవార్త నీకు సంతోషంగా లేదూ?"

".............."

"అలా బెల్లం కొట్టిన రాయిలా ఏమీ చెప్పవేం?"

అంతే ఒక్కసారిగి భోరుమన్న బావ ఎదురుగానే నేనూ కూర్చుని ఓదార్పుగా తన తలను నా ఎదలకు ఆనించుకుని

"ఏమైంది బావా?" నెమ్మదిగా అన్నాను ప్రేమగా. ఆ స్పర్శ, ఆ పలకరింపు అతని గుండె గదుల్లో నిక్షిప్తంగా ఉన్న ఏ విషయాన్ని బయట పెట్టేలా చేశాయేమోగానీ

"క్షమించు రోజా తెలీని తప్పు జరిగి పోయింది" అన్నాడు. ఆ విషయమేమిటో ప్రస్తుతానికి అడగదలుచుకోలేదు. అది మధ్యాహ్న భోజన సమయం కావడంతో,

"క్షమాపణలు తర్వాత ముందు భోజనానికి రా"

"తినాలనిపించడం లేదు సరోజా!"

"నేను తినిపిస్తాగా బావా"

బావకు ఇష్టమైన గుత్తివంకాయ కూర, గోంగూర పచ్చడిలో నెయ్యి వేసి ముద్దలుగా తినిపించాను అభిమానంగా. ఆ సమయంలో అతని కళ్ళు నన్ను ఎంతో ఆప్యాయతగా చూశాయి.

"నువ్వు తినవా?"

"తింటాను తర్వాత"

ఇంతలో ఫోన్ మోగడంతో పరుగున వెళ్ళి ఎత్తాను.

"హలో"

"అ హలో సరోజా ఎలా వున్నావు? మీ బావెలా ఉన్నాడు? అన్నట్టు మేం రేపు రాలేం. ఎందుకంటే మృతుని సంబంధీకులు ఇంకా కొందరు రావాల్సి ఉంది. వాళ్ళొస్తేకానీ అంత్యక్రియలు పూర్తి కావు." నాన్న ఫోన్.

"హమ్మయ్య ఈలోగా బావ అంతర్మథనాన్ని తెలుసుకుంటాను" అనుకున్నాను నాలో నేనే "సరే నాన్నా" అని బదులిచ్చి, నేను నాలుగు ముద్దలు గబగబా లాగించి, వంటగది శుభ్రం చేసి బావ గదిలోకెళ్ళాను.

మళ్ళీ అతను కిటికీ ఎదురుగానే కూర్చునున్నాడు.

"బావా నేనొచ్చి అయిదు నిముషాలైంది"

"సారీ గమనించలేదు"

'సరే విషయం ఏమిటో చెప్పు. ఏదో తెలీని తప్పు జరిగిపోయిందన్నావు. నాకు తెలిసి తప్పు చేసే వ్యక్తిత్వం కాదు నీది. అయినా ఆ విషయం ఏంటో వినాలనుంది.

"ఇప్పుడెందుకులే సరోజా. జీవితం అనుకూలిస్తే ఎన్నో రోజులు మిగిలున్నాయి" బావ అన్న మాటలు నేను మామూలుగా తీసుకోదలుచుకోలేదు. ముఖ్యంగా జీవితం అనుకూలిస్తే ఎన్నో రోజులు మిగిలున్నాయన్న విషయంలో అతనేదో దాస్తున్నాడన్నది స్పష్టం. అయితే అదేంటి?

"బావా నా కళ్ళల్లోకి సూటిగా చూసి చెప్పు. మనసు విప్పు, సమస్యను మనసులోనే దాచుకుని నీకు నువ్వుగా కుమిలిపోయేకంటే 'మన' అన్న వాళ్ళతో బాధను పంచుకుంటే ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. పంజరంలోని పక్షిని స్వేచ్ఛా వాయువుల్లో వదిలితే ఎంత ఆనందిస్తుందో అంతలా గుంటుంది"

నా మాటలకు బావ ఎంతగా స్పందించాడో గానీ సరాసరి నన్ను కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగాడు చిన్నపిల్లాడిలా.

"బావా! ఏంటిది? ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ముందా ఏడుపు ఆపు" అతని రోదన

పాలుకురికి సోమనాథుడు రచించిన
**'బసవ పురాణము'**
మోడరన్ టైప్ సెట్టింగ్‌లో, 1/8, డెమీ సైజులో
అందమైన బసవేశ్వరుని వర్ణచిత్రం ముఖచిత్రంగా
430 పేజిలతో వెలువడింది.
ముఖ్యంగా
దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి
ప్రస్తావనతో సర్వాంగ సుందరంగా ముద్రించిన
అపురూప పుస్తకం.
ఇంకా ఈ పుస్తకంలో బసవపురాణంతో బాటు
అనుభవ సారము, చతుర్వేద సారము, వృషాధిప శతకము,
చెన్నమల్లు సీసములు ప్రచురించడం జరిగింది.
అపురూపమైన ఈ పుస్తకం వెల రూ.125/- మాత్రమే.




ప్రతులకు :
ఆంధ్ర ప్రచురణ ప్రైవేట్ లిమిటెడ్,
103/1, లజ్ చర్చి రోడ్, మైలాపూర్, చెన్నై 600 004 కు వ్రాయండి.
రూ. 125/- ఎం.ఓ. చేసినవారికి పోస్టేజి ఖర్చులు భరించి పుస్తకం పంపించగలము.

మాత్రం ఆగలేదు. అందుకే చిన్నగా కౌగిలి నుండి విడిపడి నా రెండు చేతుల్తో అతని చెంపలను పట్టుకుని నుదిటిపై చిన్న ముద్దిచ్చి,

"బావా! బాల్య వివాహాలు ఎన్నో ఏళ్ళక్రితం రద్దయిపోయాయి కాబట్టి సరిపోయింది. లేకుంటే అప్పట్లోనే మన పెళ్ళి జరిగుండేది. అయినా మనం పెళ్ళి కాని భార్యాభర్తలం. మరి నా దగ్గర దాపరికమెందుకు?" అన్నాను ఓదార్పుగా.

"సరోజా!"

"ఆ చెప్పు బావా!"

బావ చెప్పడం ప్రారంభించాడు.

"చిన్నప్పుడే నా తలిదండ్రుల మరణం, ఆ పై మామయ్య చేరదీయడం నీకు తెలిసిందే. అయితే కొన్నేళ్ళ తర్వాత అనుకోని ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న మన కుటుంబాన్ని ఆదుకుని సురక్షిత క్షేత్రాలకు చేర్చించాలనే ఉద్దేశ్యంతో నేను కువైట్ ప్రయాణమయ్యాను నీకు గుర్తుండే ఉంటుంది. అక్కడికి వెళ్ళాక పనులు దొరక్క చాలా ఇబ్బంది పడ్డాను. ఆ పై పని దొరికింది. ఆ తర్వాత నేను కోలుకుని మన కుటుంబాన్నీ ఆదుకున్నాను. ఇదంతా నా జీవితంలో ప్రథమార్థం, ద్వితీయార్థంలో ఎప్పుడూ తప్పటడుగులు వేయని నేను వేయక తప్పింది కాదు. ఆ రోజు సంక్రాంతి ఆ దేశంలో కాదు, మనదేశంలో. ఆ సందర్భంగా మంచి వంటలు చేసుకుని మందు తీసుకున్నాం." అంటూ చెప్పుకుపోతున్న బావ మాటలకు అడ్డు వేస్తూ

"బావా గల్ఫ్‌లో ముఖ్యంగా కువైట్, అబుదాబీ, బహ్రైన్, సౌదీ అరేబియాలాంటి దేశాల్లో మద్యం దుకాణాలు ఉండవు. మరి నీకెలా మందు దొరికింది?" అని ప్రశ్నించాను.

"సరోజా! లంచం ఇవ్వడం తీసుకోవడం, భ్రూణహత్యలు ఇలా ఎన్నింటినో మనదేశం కూడా నిషేధించింది. అయినా జరగడం లేదా? అలాగే అక్కడ కూడా. మందు కొట్టడం పూర్తయ్యాక ఇక పొందు విషయం. ఇప్పటికే ఓ తప్పు చేశాను. మళ్ళీ రెండో తప్పా. అని మనః మథనంలోనూ పడ్డాను. చివరగా స్నేహితుల బలవంతం మీద అదీ పూర్తయింది. తాత్కాలిక క్షణికావేశానికి ఎవరో తెలియని దేహాన్ని అనుభవించి తాపంపై చన్నీళ్ళు చల్లాను. ఆ పై కొన్ని నెల్లు గడిచాక తరచు నీరసం, జ్వరం, ఏది తినాలనిపించకపోవడం, బరువు తగ్గడం, ముఖంలో కళ తగ్గడం వంటి సమస్యలతో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్ళాను వైద్యం కోసం. వారు జరిపిన పరీక్షల ద్వారా తెలిసింది. నాకు హెచ్.ఐ.వి. పాజిటివ్ అని." బావ కళ్ళు జడివానల్లా కన్నీళ్ళు కురిపిస్తున్నాయి.

అతను చెప్పిన ఆఖరిమాట హెచ్.ఐ.వి. పాజిటివ్ అని విన్నాక దాదాపు కొన్ని నిముషాలు మాటలు కోల్పోయాను. చాలాసేపు మా మధ్య నిశ్శబ్దం రాజ్యన్నేలింది ఓ నియంతలా. ఆ పై.. బావ తాలుకు ఏడుపు శబ్దాలే రాజ్యమేలసాగాయి. నేనేం సమాధానం చెప్పాలి? అయినా వివక్షణా జ్ఞానాన్ని కోల్పోకుండా "ఏదైతేనేం నాకు బావ కావాలి" అని మనసులోనే గట్టిగా తీర్మానించుకుని,

"హేయ్ బావా! నా పిచ్చి బావా! ఎయిడ్స్ అయితేనేం.. ఆ సైనెడ్ తీసుకున్నవాడిలా క్షణాల్లో చావు రాదు. నీ సమస్య ఏదైనా నా భర్తవి నువ్వే. నువ్వే.. నువ్వే."

"ఎలా సరోజా ఎలా? దయతో నువ్వు పెళ్ళికి అంగీకరించినా మనం శారీరకంగా ఏకం కాలేం. అదే జరిగితే ఓ మై గాడ్"

"ఎందుకు ఏకం కాలేం? చూడు బావా ఆడపిల్లలకు చదువులెందుకు? ఆ అవసరం జాబు చదవడం, జవాబు రాయడం. ఓ మెట్టు పైకెక్కితే ఏ పరిస్థితులవల్లెనో ఊరెళ్ళాల్సొస్తే ఇంగ్లీషు, తెలుగు బోర్డులు తగిలించుకున్న బస్సు ప్లేట్లను చదవగలిగి ఉంటే సరి అనుకుంటున్నవాళ్ళు మాదిరిగా కాకుండా మా అమ్మా నాన్నలు డిగ్రీ వరకు చదివించారు. పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌కు పంపేందుకూ వారు సిద్ధమయ్యారు. అయితే నువ్వొస్తున్నావన్న వార్త తెలిసి ఆపేశారు మన పెళ్ళి జరగాలని.

నా సమస్య చెప్పినా నీ చదువు గురించి ఎందుకు చెబుతున్నావ్ అని నువ్వడగవచ్చు కానీ అడగలేదు. అందుకే నేనే చెప్పాను.

బావా! దేశదేశాల్ని అధ్యయనం చేయలేక పోయినా మనదేశం, మన రాష్ట్రంలో పందొమ్మిది శాతం పురుషులు, ఏడు శాతం స్త్రీలు వివాహేతర సంబంధాలు కలిగి ఉండటంవల్ల ఈ హెచ్.ఐ.వి. జీవన సునామికి కారణం. బతుకుని లాగేసు కుంటుంది అనుకోవడమూ తప్పు. ఒక రకంగా చెప్పాలంటే ఎయిడ్స్ తీవ్రమైన జబ్బే అయినా అపోహలూ అనంతం. కొన్ని నెల్ల క్రితం మెదక్ జిల్లాలో ఓ మంచినీటి ట్యాంక్‌లో ఓ ఎయిడ్స్ రోగి శవం బయటపడింది. ఈ సంఘటనలు ఆ ప్రాంతవాసుల్ని భయపెట్టాయి. అదేవిధంగా లేనిపోని అపోహలకు తావిచ్చాయి. ఇదంతా ఓ కథ కాదు నిజమే." అని ఆగి చూశాను బావ కళ్ళల్లోకి. అతను వింటున్నాడని తెలుసుకుని మళ్ళీ ప్రారంభించాను. "ఇది అబద్ధం అనీ అనలేను. పుట్టిన బిడ్డ రెండో పుట్టిన రోజు రాక ముందే....." హెచ్.ఐ.వి. మగవారి ద్వారా మహిళ గర్భం ధరిస్తే హెచ్.ఐ.వి. పాజిటివ్ బిడ్డే పుడతాడు అనే గట్టి ప్రచారమూ ఉంది. ఈ విషయంలో కాని సైన్సు చెబుతున్న వాస్తవం ఏంటంటే స్త్రీ లేదా పురుషుడు లేదా దంపతులు ముందు నుంచే యాంటి రిట్రో వైరల్ థెరపీని నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో పాటిస్తే తగు జాగ్రత్తలు తీసుకుంటే నూటికి నూరు శాతం అనలేం కానీ తొంభై ఎనిమిది శాతం భార్యాభర్తలు హెచ్.ఐ.వి. నెగిటివ్ బిడ్డలనే కనొచ్చు. ఏ జబ్బూ లేని ఎంతోమంది తలిదండ్రులకు అవిటి పిల్లలు, బుద్ధిమాంద్యం గల పిల్లలు పుట్టడం లేదా?" అని ఆడిగి చూశాను.

నా మాటలు బావపై ప్రభావితం చేసినట్టున్నాయి. అతని ముఖ కవళికల్లో మార్పు కనిపించింది. శ్రద్ధగా వింటున్నాడు. మళ్ళీ ప్రారంభించాను.

"బావా వంశంలో అటూ ఇటూ ఏడు తరాలు గుర్తున్నంత వరకు ఏ జబ్బూ లేవని నిర్ధారించుకుని పెళ్ళిళ్ళు జరుపుతున్నా, ఎందరో నవదంపతులకు లోపం వున్న పిల్లలు పుట్టడం లేదా? మనిషి ఆశాజీవి బావా. మనకు మంచి జరుగుతుందనే భావించి అన్ని జాగ్రత్తలు తీసుకుని అధునాతన వైద్య సదుపాయాలు అందుకోవాలి. కాలం చెల్లిన వైద్యాన్ని అచరించకుండా క్లోనింగ్ విధానంతో సృష్టికి ప్రతి సృష్టికి మనిషి పూనుకుంటున్నాడు. మరి ఇలాంటప్పుడు ఏ జబ్బును గురించి ఆలోచించకూడదు. రోజుకు ఇరవై లేదా ముప్ఫై రూపాయలకే లభ్యమౌతున్న మాంటి రిట్రో వైరల్ థెరపీని ఆరంభిస్తే హెచ్.ఐ.వి. వాళ్ళు కూడా ఓ మధుమేహ వ్యాధిగ్రస్తునిలా లేదా ఓ ఆస్తమా రోగిలా రోజూ మందులు వేసుకుంటే ఆరోగ్యంగా జీవితం వెళ్ళదీయవచ్చు" అని ఊపిరి పీల్చుకున్నాను.

ఉన్నపళంగా నన్ను కౌగలించుకుని ఏడుస్తున్న బావ కన్నీళ్ళు నా గుండెలపై పడ్డాయి. అ కన్నీళ్ళ బాధ నాకు తెలుసు. వాటి కృతజ్ఞతా నాకు తెలుసు. ❀